



## జొమాటోకు యాంట్ గ్రూప్ గుడ్‌బై

న్యూఢిల్లీ, నవంబర్ 28: ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో నుంచి ప్రసిద్ధ చైనా వాణిజ్య వేత్త జాక్‌మాకు చెందిన యాంట్ గ్రూప్ పూర్తిగా వైదొలగనుంది. యాంట్ గ్రూప్ కంపెనీ అలీపే 29.6 కోట్ల జొమాటో షేర్లను రూ.3,290 కోట్లకు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనున్నట్టు సమాచారం. షేరుకు రూ. 111.28 ధరతో ఆఫ్‌లోడ్ చేయడానికి అవసరమైన లావాదేవీల్ని బొఫా సెక్యూరిటీస్; మోర్గాన్ స్టాన్లీ సిద్ధం చేశాయి. ఇటీవలే జపాన్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ జొమాటో 1.1 శాతం వాటాను రూ. 1,200 కోట్లకు విక్రయించింది. గత ఏడాదికాలంగా జొమాటో షేరు ధర రూ.62 నుంచి 80 శాతం పెరిగి రూ. 113 వద్దకు చేరింది.

# అమ్మకానికి కీలక ఖనిజాలు

### నేటినుంచి తొలి రౌండ్ వేలం ప్రారంభం





### లిథియం, గ్రాఫైట్, టైటానియం తదితర అరుదైన ఖనిజాలున్న 20 బ్లాక్‌లకు బిడ్డింగ్


న్యూఢిల్లీ, నవంబర్ 28: అరుదుగా లభించే కీలక ఖనిజాలున్న బ్లాక్‌లను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాలున్న 20 బ్లాక్‌లకు బుధవారం తొలి రౌండ్ వేలం నిర్వహించనున్నట్టు మంగళవారం అధికారిక ప్రకటన తెలిపింది. దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ భద్రతకు కీలక ఖనిజాలు ముఖ్యమైనవని, ఆన్‌లైన్‌లో రెండు దశల్లో వేలం ప్రక్రియ జరుగుతుందని పేర్కొంది. ఎంఎస్‌టీసీ ఆక్షన్ ప్లాట్‌ఫామ్‌లో వేలానికి పెడుతున్న మినరల్ బ్లాక్‌ల వివరాలు, వేలం నిబంధనలు తదితరాలు అందుబాటులో ఉంచినట్టు ప్రకటన తెలిపింది. పునరుత్పాదక ఇంధన రంగం, రక్షణ, వ్యవసాయం తదితర రంగాలకు అవసరమైన లిథియం, గ్రాఫైట్, కోబాల్ట్, టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్‌ఈఈ) తదితర ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని, ఈ కీలక, వ్యూహాత్మక ఖనిజాలకు భారీ డిమాండ్ ఉందని ప్రభుత్వం వివరించింది. మైనింగ్ రూల్ సవరణ ద్వారా కేంద్రం 24 రకాల కీలక ఖనిజాల్ని ఇటీవల నోటిఫై చేసింది. అలాగే మూడు కీలక ఖనిజాలు లిథియం, నియోబియమ్, ఆర్‌ఈఈలకు రాయల్టీ రేట్లకు కూడా కేంద్ర క్యాబినెట్ అక్టోబర్‌లో ఆమోదం తెలిపింది.

#### పలు రంగాల నుంచి డిమాండ్

ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీలు, పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో ఈ కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్నది. డిఫెన్స్, ఫార్మాస్యూటికల్స్, హైటెక్ ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, గిగా ఫ్యాక్టరీల ఏర్పాటులో ఈ ఖనిజాల్ని వాడాల్సిందే. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల్లో వాడే లిథియం బ్లాక్‌లను ఇటీవల జమ్ము కశ్మీర్, కర్ణాటక రాష్ర్టాల్లో గుర్తించారు. కోల్ ఇండియా, ఎన్టీపీసీలు తదితర దిగ్గజ కంపెనీలు ఈ ఖనిజాల మైనింగ్‌లో ప్రవేశించేందుకు వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి. అలాగే మూడు ప్రభుత్వ రంగ కంపెనీలు కలిసి ఖనిజ్ విదేశ్ ఇండియా పేరుతో ఒక జాయింట్ వెంచర్ నెలకొల్పాయి.

## కిరాణాల కోసం ఎఫ్‌ఎంసీజీల కార్యాచరణ

- గ్రామీణ ప్రాంత వ్యాపారాన్ని పెంచే దిశగా బడా కంపెనీల అడుగులు
- కిరాణా స్టోర్లలో ట్రూ ఎలిమెంట్స్, ప్లిక్స్ వంటి డిజిటల్ బ్రాండ్స్‌ను అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్న మారికో
- కిరాణా దుకాణాల్లో మరింత తక్కువ, సరసమైన ధరలకు ఆకర్షణీయమైన ఉత్పత్తులను తెచ్చే యోచనలో డాబర్
- ది మ్యాన్ కంపెనీ, బ్రిల్లారేవంటి ఆన్‌లైన్ బ్రాండ్స్‌ను ఆఫ్‌లైన్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టాలని చూస్తున్న ఇమామీ




**మార్కెట్ తీరిది..**

అక్టోబర్‌లో మూతబడిన రిటైల్ స్టోర్లు **3.4%** ఈ ఏడాది ఆగస్టుతో పోల్చితే..

ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో చాలా వరకు ఎఫ్‌ఎంసీజీ సంస్థలు సంప్రదాయ మార్కెట్‌లో అమ్మకాలు తగ్గినట్టు చూపాయి

# కిరాణాకు ఊపిరి..

### సంప్రదాయ మార్కెట్ బలోపేతంపై ఎఫ్‌ఎంసీజీ కంపెనీల దృష్టి

### సరికొత్త వ్యూహాల దిశగా మారికో, డాబర్, ఇమామీ, బజాజ్ కన్స్యూమర్

### గ్రామీణ ప్రాంత కొనుగోలుదారులే లక్ష్యంగా మార్కెట్‌లోకి నయా ఉత్పత్తులు

న్యూఢిల్లీ, నవంబర్ 28: గత కొంతకాలంగా కిరాణా స్టోర్లు లేదా సంప్రదాయ దుకాణాల్లో ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) అమ్మకాలు క్రమేణా మందగిస్తున్నాయి. ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న కిరాణాల్లో ఈ పరిస్థితి.. ఆయా సంస్థలకు వ్యాపారాన్ని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత కొనుగోలుదారులను దూరం చేస్తున్నది. దీంతో ఎఫ్‌ఎంసీజీ ఇండస్ట్రీలో మెజారిటీ వాటాదారులైన మారికో, డాబర్, ఇమామీ, బజాజ్ కన్స్యూమర్ సంస్థలు వ్యూహాత్మక ప్రణాళికల్ని ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యాయి.

#### ఈ-కామర్స్‌తో దెబ్బ

ఈ-కామర్స్ సంస్థలు దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతోపాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోకి వేగంగా విస్తరిస్తున్నాయి. ఇది స్థానిక కిరాణాల వ్యాపారానికి పెద్ద ఎత్తునే గండి కొడుతున్నది. ఆన్‌లైన్‌లో కొత్తకొత్త ఉత్పత్తులు, తక్కువ ధరలకే లభిస్తుండటంతో కస్టమర్లు ఎగబడి కొనేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్ కూడా అందరికీ అందుబాటులో ఉండటం.. ఆన్‌లైన్ వ్యాపార సంస్థలకు కలిసొస్తున్నది. అయితే ఆన్‌లైన్ మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తుల్లో చాలావరకు ప్రధాన సంస్థలవి కావు. దీంతో కిరాణా వ్యాపారుల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపకుంటే తమ ఉనికికే ప్రమాదం అని భావిస్తున్న బడా ఎఫ్‌ఎంసీజీ సంస్థలు.. గ్రామీణ ప్రాంత కొనుగోలుదారులే లక్ష్యంగా మార్కెట్‌లోకి రాబోయే త్రైమాసికాల్లో మరిన్ని కొత్త ఉత్పత్తుల్ని సరసమైన ధరలకే తీసుకురావాలని యోచిస్తున్నాయిప్పుడు.

#### కొత్తగా క్రెడిట్?

వ్యాపారం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కిరాణా వ్యాపారులు హోల్‌సేల్ మార్కెట్‌లో ఉద్దెరపై ఇప్పటికే తీసుకున్న ఉత్పత్తుల బాకీలను చెల్లించలేకపోతున్నారు. దీంతో దుకాణాల్లో సరుకులు నిండుకున్నా కొందరు అరకొర ఉత్పత్తులతోనే వ్యాపారాలు చేస్తుండగా, మరికొందరు పెట్టుబడుల్లేక స్టోర్లనే మూసేస్తున్నారు. ఇక రిలయన్స్ రిటైల్, డీ-మార్ట్ వంటి స్టోర్లతోనూ కిరాణాలకు దెబ్బ తగులుతున్నది. దీంతో కొత్తగా క్రెడిట్ లభించేలా హోల్‌సేల్ మార్కెట్ ద్వారా రిటైల్ వ్యాపారులకు సంకేతాలిచ్చే యోచనలోనూ కంపెనీలు ఉన్నట్టు తెలుస్తున్నది.

*గతి తప్పిన కిరాణా స్టోర్ల వ్యాపారాన్ని తిరిగి పట్టాలెక్కించేందుకు రాబోయే త్రైమాసికాల్లో ఓ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లనున్నాం. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు కొత్త ఉత్పత్తులను తీసుకొస్తాం.*

*-సౌగతా గుప్తా, మారికో ఎండీ*

*కిరణా వ్యాపారులకు డిస్ట్రిబ్యూటర్లు ఇప్పటికే పెద్ద ఎత్తున క్రెడిట్ ఇచ్చారు. సకాలంలో అవి తిరిగి వసూలు కావడం లేదు. దీంతో దుకాణదారులకు కొత్త అప్పులు సమస్యగా మారుతున్నాయి. ఇది స్టోర్ల మూసివేతకు దారితీస్తున్నది.*

*-మయాంక్ షా, పార్లే ప్రొడక్ట్స్ సీనియర్ కేటగిరీ అధిపతి*

# సిడ్నీ ఐడీతో భారత్ బయోటెక్ దోస్తీ

### అంటు రోగాల నివారణకు వ్యాక్సిన్ రిసెర్చ్ కోసం ఒప్పందం



సిడ్నీ ఐడీ డిప్యూటీ డైరెక్టర్ ట్రిక్కాస్‌తో భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా

హైదరాబాద్, నవంబర్ 28: యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ ఇన్ఫెక్టియస్ డిసీజెస్ (సిడ్నీ ఐడీ) ఇనిస్టిట్యూట్‌తో భారతీయ వ్యాక్సిన్ల తయారీ దిగ్గజం, హైదరాబాదీ ఔషధ రంగ సంస్థ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒప్పందం చేసుకున్నది. అడ్వాన్స్ వ్యాక్సిన్ రిసెర్చ్ కార్యక్రమాల కోసం, విద్యా-పారిశ్రామిక భాగస్వామ్యాల బలోపేతంతోపాటు అంటు రోగాల నివారణకు అంతర్జాతీయ స్థాయిలో చర్యలకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని మంగళవారం భారత్ బయోటెక్ తెలియజేసింది. 'భవిష్యత్తులో సంభవించే అంటు వ్యాధులు, ఇతర ప్రాణాంతక రోగాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కావాల్సిన పద్ధతులు, చికిత్సల్ని కనిపెట్టాలనే ఔషధ రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ సంస్థాగతేతర సహకారం కోసం యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ ఇన్ఫెక్టియస్ డిసీజెస్ ఇనిస్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం' అని ఈ సందర్భంగా ఓ ప్రకటనలో భారత్ బయోటెక్ స్పష్టం చేసింది. 'భాగస్వామ్య పరిశోధనలు, వ్యాక్సిన్ తయారీలో నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడంలో ఈ ఒప్పందం మాకున్న చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తుంది' అని సదరు ప్రకటనలో భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు. అలాగే తమ ప్రతిభను నిరూపించుకునేందుకు యువ శాస్త్రవేత్తలకూ దీన్నో గొప్ప అవకాశంగా అభివర్ణించారు. 'భారత్ బయోటెక్‌తో మా కలయిక.. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ రంగంలో బలమైన ప్రభావాన్ని చూపగలదు. మానవ, జంతు సంబంధిత అంటువ్యాధుల నిర్మూలనకు సురక్షితమైన వ్యాక్సిన్‌ను సరసమైన ధరలకే అందించేందుకు కృషి చేస్తాం' అని సిడ్నీ ఐడీ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జామీ ట్రిక్కాస్ అన్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని అంతమొందించడంలో కీలకపాత్ర పోషించిన కోవాగ్జిన్‌ను భారత్ బయోటెక్ తయారు చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో తయారైన ఈ వ్యాక్సిన్.. ఎంతో ప్రభావవంతంగా కోవిడ్-19 వైరస్‌పై పోరాడింది.

## ప్రతీ 6 షేర్లకు ఒక షేరు

### చిన్న ఇన్వెస్టర్లకు టీసీఎస్ బైబ్యాక్ యాక్సెప్టెన్సీ రేషియో

న్యూఢిల్లీ, నవంబర్ 28: ఐటీ దిగ్గజం టీసీఎస్ ప్రకటించిన రూ.17,000 కోట్ల బైబ్యాక్ ప్రక్రియ డిసెంబర్ 1న ప్రారంభం కానుంది. డిసెంబర్ 7న ముగుస్తుంది. ఈ బైబ్యాక్‌లో ఇన్వెస్టర్లు వారి వద్దనున్న టీసీఎస్ షేర్లను ఒక్కోదానిని రూ.4,150 ధరకు విక్రయించుకోవచ్చు. ఈ బైబ్యాక్ పథకంలో టీసీఎస్ తన మొత్తం ఈక్విటీలో 1.12 శాతం షేర్లను (4.09 కోట్ల షేర్లు) టీసీఎస్ కొనుగోలు చేయనుంది. రూ.2 లక్షల లోపు పెట్టుబడి కలిగిన చిన్న ఇన్వెస్టర్లకు ప్రతీ 6 షేర్లకు ఒక షేరును యాక్సెప్టెన్సీ రేషియోగా నిర్ణయించినట్టు టీసీఎస్ మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. అంటే 6 షేర్లను చిన్న మదుపరులు కంపెనీకి అమ్మేందుకు టెండర్ సమర్పిస్తే ఒక షేరును తీసుకుని రూ.4,150 ధరను టీసీఎస్ చెల్లిస్తుంది. మిగిలిన షేర్లను ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చేస్తుంది. అలాగే ఇతర అర్హమైన ఇన్వెస్టర్లకు ప్రతీ 209 షేర్లకు 2 షేర్లు యాక్సెప్టెన్సీ రేషియోగా నిర్ణయించారు. బైబ్యాక్ ప్రారంభంకానున్న నేపథ్యంలో మంగళవారం బీఎస్‌ఈలో ఈ షేరు ధర రూ. 3,470 వద్ద ముగిసింది.

## నేడు ఐఆర్‌ఈడీఏ లిస్టింగ్

ముంబై, నవంబర్ 28: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) షేరు నవంబర్ 29న లిస్ట్ కానున్నాయి. ఈ మేరకు ఎక్స్ఛేంజీలు మంగళవారం సర్క్యులర్లు విడుదల చేశాయి. నవంబర్ 23న ముగిసిన ఐఆర్‌ఈడీఏ తొలి పబ్లిక్ ఆఫర్‌కు ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. 38.80 రెట్లు అధికంగా బిడ్స్ సంపాదించింది. ఆఫర్ ధరను రూ.32 వద్ద నిర్ణయించగా, గ్రే మార్కెట్లో పలుకుతున్న ధర ఆధారంగా 30 శాతం ప్రీమియంతో రూ.42 వద్ద లిస్ట్ కావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిరుడు మే నెలలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఐపీవో తర్వాత మార్కెట్లోకి వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ ఇదేకావడం గమనార్హం.

## భెల్‌కు 2,956 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, నవంబర్ 28: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి రూ.2,956 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్‌లో భాగంగా దేశీయ నౌకదళానికి 16 సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్, విడిభాగాలను సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపింది. హరిద్వార్‌లో ఉన్న భెల్ ప్లాంట్లోనే చిన్న స్థాయి క్షిపణులు, యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ వెపన్లను ను తయారు చేసి ఇవ్వనున్నది.

# 70 లక్షల మొబైల్ నెంబర్లు కట్

### అనుమానిత ఆర్థిక లావాదేవీలే కారణం

### ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి



న్యూఢిల్లీ, నవంబర్ 28: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు అనుమానిత ఆర్థిక లావాదేవీలను జరుపుతున్న 70 లక్షల మొబైల్ నెంబర్లను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. ఆర్థిక సైబర్ భద్రత, పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల మోసాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు మంగళవారం ఓ సమావేశం జరిగింది. దీనికి జోషీనే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రకమైన సమావేశాలు ఇకపైనా జరుగుతాయని, వచ్చే ఏడాది జనవరిలో తదుపరి సమావేశం ఉంటుందని చెప్పారు. ఇక డిజిటల్ మోసాల నివారణకు బ్యాంకింగ్ వ్యవస్థ కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థలో మోసానికి సంబంధించి మాట్లాడుతూ రాష్ర్టాలను దీనిపై దృష్టి పెట్టాలని కోరినట్టు, వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉండేలా చూడాలన్నట్టు చెప్పారు. వ్యాపారుల కేవైసీ ప్రామాణికతకు సంబంధించీ చర్చ జరిగింది. కాగా, సైబర్ మోసాలపై సమాజంలో అవగాహన పెరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంగా జోషి వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగానికి చెందిన యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)ల్లో ఇటీవలి కాలంలో డిజిటల్ మోసాలు జరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఐఎంపీఎస్ ద్వారా ఖాతాదారుల ఖాతాల్లోకి యూకో బ్యాంక్ నుంచి పొరబాటున రూ.820 కోట్లు బదిలీ అయ్యాయి. దీన్ని గుర్తించిన బ్యాంక్.. ఆ తర్వాత సదరు ఖాతాలను బ్లాక్ చేసి రూ.649 కోట్లు రాబట్టింది. ఇది ఎలా జరిగిందన్నదానిపై బ్యాంక్ వివరణ ఇవ్వాల్సి ఉన్నది.

# రికార్డు స్థాయికి వాహన విక్రయాలు

### పండుగ సీజన్‌లో 19 శాతం వృద్ధి: ఫాడా



న్యూఢిల్లీ, నవంబర్ 28: వాహన విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కస్టమర్లు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో ఈ ఏడాది పండుగ సీజన్‌లో అత్యధికంగా అమ్ముడయ్యాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్(ఫాడా) తాజాగా వెల్లడించింది. అన్ని సెగ్మెంట్లకు చెందిన వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు దోహదం చేశాయని ఫాడా వర్గాలు వెల్లడించాయి. 42 రోజులపాటు సాగిన ఈ పండుగ సీజన్‌లో 37,93,584 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో అమ్ముడైన 31,95,213 యూనిట్లతో పోలిస్తే 19 శాతం అధికమని పేర్కొంది. నవరాత్రి సందర్భంగా తొలి రోజు ప్రారంభమైన పండుగ సీజన్ ధంతేరస్ తర్వాత 15 రోజులకు ముగిసింది. వీటిలో 5,47,246 ప్యాసింజర్ వాహనాలు ఉన్నాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో అమ్ముడైన 4,96,047 యూనిట్ల కంటే ఇది పది శాతం అధికం కావడం విశేషం. ఈసారి పండుగ సీజన్ అక్టోబర్ 15 నుంచి నవంబర్ 25 వరకు కొనసాగింది.

- ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్లు 21 శాతం ఎగిసి 23,96,665 యూనిట్ల నుంచి 28,93,107 యూనిట్లకు చేరుకున్నాయి.
- కమర్షియల్ వాహన విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 8 శాతం పెరిగి 1,23,784లకు చేరాయి.
- త్రిచక్ర వాహన రిజిస్ట్రేషన్లు 41 శాతం పెరిగి 1,42,875లకు చేరాయి. ఏడాది క్రితం 1,01,052 యూనిట్లే.
- కానీ, ట్రాక్టర్ల అమ్మకాలు 86,951 యూనిట్ల నుంచి 86,572 యూనిట్లకు పడిపోయాయి.
- ఫాడా ఈ వాహన విక్రయాల రిజిస్ట్రేషన్లను 1,355 ఆర్టీవోల నుంచి సేకరించింది. అలాగే 15 వేల ఆటోమొబైల్ డీలర్ల నుంచి తీసుకున్నది.

*నవరాత్రి సీజన్‌లో ప్యాసింజర్ వాహన విక్రయాలు అంతంతే ఉన్నప్పటికీ దీపావళి నాటికి భారీగా పెరిగాయి. ఈ సీజన్‌లో మిగతావాటితో పోలిస్తే స్పోర్ట్ యుటిలిటీ వాహనాలకు అత్యధికంగా డిమాండ్ నెలకొన్నది. ప్యాసింజర్ వాహనాల ఇన్వెంటరీలు ఇంకా గరిష్ఠ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ఉండటం కలిసొచ్చింది. పండుగ సీజన్ ప్రారంభంలో ట్రాక్టర్ల అమ్మకాలు 8.3 శాతం తగ్గగా, చివర్లో తిరిగి పుంజుకున్నాయి.*

*- మనీష్ రాజ్ సింఘానియా, ఫాడా ప్రెసిడెంట్*

# మార్కెట్లు భళా

### మళ్లీ 66 వేలపైకి సెన్సెక్స్

### నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి 19,890 స్థాయికి


ముంబై, నవంబర్ 28: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. చివరి గంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు కోలుకున్నాయి. వాహన, పవర్, మెటల్ షేర్లు మెరవడంతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడంతో సెన్సెక్స్ తిరిగి 66 వేల మార్క్‌ను అధిగమించింది. 66,256 నుంచి 65,906 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 204.16 పాయింట్లు అందుకొని 66,174.20 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 95 పాయింట్లు అందుకొని 19,889.70 వద్ద స్థిరపడింది.

#### టాప్ గెయినర్‌గా టాటా మోటర్స్

టాటా గ్రూపునకు చెందిన షేర్లు కదంతొక్కాయి. ముఖ్యంగా టాటా మోటర్స్ షేరు అత్యధికంగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ, టైటాన్, యాక్సిస్ బ్యాంక్‌ల షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఐటీసీ, హిందుస్థాన్ యునిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే యుటిలిటీ 3.64 శాతం, పవర్ 3.47 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 3.13 శాతం, ఎనర్జీ 2.27 శాతం, సేవలు 2.02 శాతం, కమోడిటీ 1.27 శాతం, మెటల్ 1.13 శాతం చొప్పున అధికమయ్యాయి. కానీ, ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రీయల్స్, టెలికమ్యూనికేషన్స్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోయాయి.

#### కదం తొక్కిన అదానీ షేర్లు

అదానీ షేర్లు కదంతొక్కాయి. సుప్రీంకోర్టులో అదానీ గ్రూపునకు అనుకూలంగా తీర్పువచ్చే అవకాశం ఉండటంతో అదానీ గ్రూపు షేర్లు 20 శాతం వరకు లాభపడ్డాయి. స్టాక్ మార్కెట్లో లిస్టైన 10 సంస్థల్లో లాభాల్లో ముగియడం విశేషం. అత్యధికంగా అదానీ టోటల్ గ్యాస్ 20 శాతం లాభపడగా, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 19 శాతం, అదానీ పవర్ 12.32 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 12.27 శాతం, ఎన్‌డీటీవీ 11.73 శాతం, అదానీ విల్మార్ 9.96 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 8.66 శాతం చొప్పున పెరిగాయి. అలాగే అదానీ పోర్ట్స్ 5.20 శాతం, అంబుజా సిమెంట్ 4.22 శాతం, ఏసీసీ సిమెంట్ 2.62 శాతం చొప్పున లాభపడ్డాయి. దీంతో ఈ పది సంస్థల మార్కెట్ విలువ లక్ష కోట్ల రూపాయలు పెరగడంతో మొత్తం గ్రూపు విలువ రూ.11.31 లక్షల కోట్లకు చేరుకున్నది. గత శుక్రవారం ఇది రూ.10.26 లక్షల కోట్లుగా ఉన్నది.



#### 4 ట్రిలియన్ డాలర్లకు..

బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ మరో రికార్డును సొంతం చేసుకున్నది. ఇప్పటికే రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న కంపెనీల నికర విలువ 4 లక్షల కోట్ల డాలర్లకు చేరువైంది. మంగళవారం మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల నికర విలువ రూ.331 లక్షల కోట్లకు చేరుకున్నది. చివరకు రూ.3,31,05, 425.71 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 83.34 ఆధారంగా చూస్తే కంపెనీల విలువ 3.97 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. మే 24, 2021న బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ 3 లక్షల కోట్ల డాలర్లు దాటిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 15న సెన్సెక్స్ చారిత్రక గరిష్ఠ స్థాయి 67,927.23ని తాకిన విషయం తెలిసిందే.